

## కుటుంబ వేడుకను రేవ్ పార్టీ అనడం సిగ్గుచేటు

ఖమ్మం, అక్టోబర్ 28 : బీఆర్ఎస్‌ను, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేని సీఎం రేవంత్‌రెడ్డి.. చౌకబారు పనులకు తెర లేపారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆరోపించారు. అందులో భాగంగానే కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో జరిగిన కుటుంబ వేడుకను రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన గృహ ప్రవేశ వేడుకను రేవ్‌పార్టీగా పేర్కొనడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'కాంగ్రెస్ మంత్రులు, నాయకుల ఇళ్లల్లో విదేశీ మద్యం లేదా?' వారు విదేశీ మద్యం తాగరా? అని ప్రశ్నించారు.




## రేవంత్‌రెడ్డిది అరాచక పాలన

సూర్యాపేట, అక్టోబర్ 28 (నమస్తేతెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే వారి బంధువులను టార్గెట్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అరాచక పాలన కొనసాగిస్తున్నారని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో పోలీసులు సోదాలు, కేటీఆర్ ఇంటిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో బడుగుల మాట్లాడుతూ.. కేటీఆర్ బంధువుల గృహప్రవేశ వేడుకను రాద్ధాంతం చేయడం హాస్యాస్పదమన్నారు. పోలీసుల ఎఫ్ఐఆర్ మొత్తం అబద్ధాల పుట్ట అని, అధికారులు ఇచ్చిందొకటి, వాళ్లు చేసిందొకటని మండిపడ్డారు.



## రాష్ట్రంలో కక్షపూరిత పాలన

భద్రాచలం, అక్టోబర్ 28 : మాది ప్రజాపాలన అంటూ పదే పదే వల్లె వేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు రాష్ట్రంలో కక్షపూరిత పాలన సాగిస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ కుటుంబ సభ్యులు తెలంగాణ సంప్రదాయం ప్రకారం దావత్ చేసుకుంటే దానిని రేవ్ పార్టీగా చిత్రీకరించి రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.



## కేటీఆర్‌పై బురద జల్లేందుకు కుట్ర

బెల్లంపల్లి/చెన్నూరు, అక్టోబర్ 28: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై బురదజల్లేందుకు ఆయన బావమరిదిపై డ్రగ్స్ కేసు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని మండిపడ్డారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే జన్వాడ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీలు జరిగాయంటూ ప్రభుత్వం పోలీసులతో తనిఖీలు చేయించి సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బీఆర్ఎస్వీ నాయకులు, చెన్నూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి.



తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దేశపతి శ్రీనివాస్, నాయకులు దేవీప్రసాద్, పల్లె రవికుమార్‌గౌడ్, బొమ్మెర రామ్మూర్తి

# రేవంత్‌లో విషం తప్ప విజన్ లేదు

మొదటిపేజీ తరువాయి...

బోగస్ చేసి, పత్తికి మద్దతు ధర ఇవ్వకుండా రైతులను దగాచేశారని, రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, శంభీపూర్ రాజు, ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యతో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అరాచక పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలకు బతుకమ్మ చీరలు, పంటలకు మద్దతు ధర ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. పత్తి క్వింటాల్‌కు రూ.7521 ఎమ్మెస్పీ ఇవ్వకపోవడంతో రూ. 5 వేలకే దళారులకు రైతులు తెగనమ్ముకుంటున్నారని, మక్కను కొనే దిక్కులేదని, కొనుగోలు చేసిన సోయాబీన్‌ను సైతం వాపస్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. పత్తి కొనాలని ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మంలో రైతులు రోడ్డెక్కిన ఘటనలు, ఆదిలాబాద్‌లో కలెక్టర్ కాళ్లమీద పడిన దుస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని చెప్పారు. 'నాడు కేసీఆర్ రెండు పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతుబంధు ఇస్తే మూడు పంటలకు కలిపి ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇవ్వాలని పొంకణాలు కొట్టిన రేవంత్‌రెడ్డి..ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి' అని నిలదీశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటే, రేవంత్‌రెడ్డి వారి పొట్టగొడుతున్నారని ధ్వజమెత్తారు.

### లక్ష ఉద్యోగాలని చెప్పి నట్టేట ముంచారు

ఏటా లక్ష ఉద్యోగాలిస్తామని చెప్పి గద్దెనెక్కిన రేవంత్ సర్కారు, ఏడాది సమీపిస్తున్నా 20 వేల జాబ్‌లకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను నట్టేట ముంచిందని హరీశ్ ఫైర్ అయ్యారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి అశోక్‌నగర్ వెళ్లి ఏడాదిలోనే లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం నిరుద్యోగుల వీపులపై లాఠీలతో విరుచుకుపడి అశోక్‌నగర్‌ను శోకనగర్‌గా మార్చిందని దుయ్యబట్టారు. విద్యార్థులకు భరోసా కార్డులిస్తామని, క్రమం తప్పకుండా రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పి మోసం చేసి ఇప్పుడు మొద్దునిద్ర నటిస్తున్నదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ డీఏలు, ఆరునెలల్లోగా పీఆర్సీ ఇస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చి గతంలో ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకొని కేసీఆర్ మంజూరు చేసిన డీఏనే ఇప్పుడు విడుదల చేసి దీపావళి పండుగ చేసుకొమ్మనడం విడ్డూరంగా ఉన్నదని చెప్పారు. పీఆర్సీ విషయంలో ఉలుకూపలుకూ లేదని విమర్శించారు. రిటైర్డ్ అయిన అంగన్‌వాడీలు, ఉద్యోగులకు పైసా ఇవ్వని ఏకైక ప్రభుత్వం ఇదేనని ఎద్దేవాచేశారు.

### కేటీఆర్ క్యారెక్టర్‌ను దెబ్బతీసేందుకే డ్రగ్స్ డ్రామా..

11 నెలల్లోనే రేవంత్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదని, పాలనపై అవగాహన లేక రాష్ట్రాన్ని దివాలా తీయించారని, ఈ పరిస్థితుల్లో డైవర్షన్ పాలిటిక్స్‌కు రేవంత్‌రెడ్డి తెరలేపారని హరీశ్ మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలను ఎండగడుతున్న కేటీఆర్‌పై సీఎం కక్షగట్టారని, పోరాటం చేస్తున్న కేటీఆర్‌ను నిలువరించేందుకు ఆయన కుటుంబాన్ని బద్నాం చేసే కుట్రకు పూనుకున్నారని దునుమాడారు. దీపావళి సందర్భంగా కేటీఆర్ బంధువులు ఫంక్షన్ చేసుకుంటే రేవ్ పార్టీగా చిత్రీకరించి మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని, రేవ్ పార్టీ అయితే 70 ఏండ్ల వయస్సున్న కేటీఆర్ అత్త, రెండు మూడేండ్ల చిన్నపిల్లలు ఎందుకు ఉంటారని నిలదీశారు. రైడ్ చేసిన అధికారులు అక్కడ ఏమీ దొరకలేదని చెప్పడం నిజంకాదా? అని ప్రశ్నించారు.

### పోలీసులపై కక్ష ఎందుకు?

'నేను పోలీసు కుటుంబం నుంచే వచ్చిన.. అధికారంలోకి రాగానే ఏక్ పోలీసింగ్ తెస్తా.. వారానికో సెలవు మంజూరు చేస్తా అని అరచేతిలో స్వర్గం చూపిన రేవంత్‌రెడ్డి.. 11 నెలలైనా ఎందుకు పట్టించుకోవడం లేదు' అని హరీశ్ నిలదీశారు. న్యాయం కోసం రోడ్డుమీదికొచ్చిన పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబాలను పోలీసులతోనే అరెస్ట్ చేయించడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పోలీసులనే పోలీసులు కొట్టే దుస్థితి తెలంగాణలో నెలకొనడం దురదృష్టకరమన్నారు. తమకు ఇంటి పని చెప్తున్నారని ఇటీవల ఓ కానిస్టేబుల్ ఎస్పీ కాళ్ల మీద పడిన ఘటన చూస్తే కన్నీళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తంచేశారు. సెలవులివ్వాలని అడిగిన పాపానికి 39 మంది బెటాలియన్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం, మరో పది మందిని ఉద్యోగాల నుంచి తొలగించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. తెలంగాణలో రక్షక భటులకే రక్షణ లేకుండా పోయిందని వాపోయారు.

### రేవంత్, సంజయ్ ఆర్ఎస్ బ్రదర్స్

కాంగ్రెస్ సర్కారు అరాచక పాలనపై బీఆర్ఎస్ పోరాడుతుంటే బీజేపీ చోద్యం చూస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. సమస్యలపై ఆ పార్టీకి చెందిన బండి సంజయ్ ప్రభుత్వాన్ని నిలదీయకుండా నాటకాలాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని మంత్రులే కూల్చుతారని సంజయ్ చెప్పడం చూస్తుంటే కుమ్మక్కు రాజకీయం స్పష్టంగా తెలిసిపోతున్నదని ఎద్దేవాచేశారు. 'రేవంత్ తానా అంటే సంజయ్ తందాన అంటున్నడు. సంజయ్ వైఖరి చూస్తుంటే ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిలా లేడు. రేవంత్ సహాయ మంత్రిలా పనిచేస్తున్నడు' అని దుయ్యబట్టారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఉపాధిహామీ కింద వచ్చిన రూ.500 కోట్లు, హెల్త్‌మిషన్ కింద వచ్చిన రూ. 300 కోట్లు ఎక్కడికి పోయాయని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని హితవు పలికారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ఆర్ఎస్ బ్రదర్స్ పాలన సాగుతున్నదనే విషయం స్పష్టమవుతున్నది చెప్పారు. రామన్నపేట వద్ద అంబానీ సిమెంట్ ఫ్యాక్టరీని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంటే, బీజేపీ నాయకులు మౌనంలో ఆంతర్యమేంటని నిలదీశారు.

### తొలగింపు, సస్పెన్షన్‌ను రద్దు చేయాలి: హరీశ్

ప్రభుత్వం భేషజాలకు పోకుండా టీజీఎస్పీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని, 10 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ, 39 మంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకొని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని కోరితే 10 మంది కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి తొలగించడం హేయమైన చర్య అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'నేను పోలీసు కుటుంబం నుంచి వచ్చిన. పోలీసుల కష్టాలు నాకు తెలుసు. ఇంట్లో భార్య, బిడ్డలు పడే బాధ నాకు తెలుసు' అంటూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఊదరగొట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక పోలీసుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నారని, అధికారం లేకుంటే ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా ఏంటని ప్రశ్నించారు.

### మూసీ శుద్ధిని ప్రారంభించింది కేసీఆరే..

మూసీ శుద్ధీకరణ ప్రాజెక్టును కేసీఆరే ప్రారంభించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. 31 ఎస్టీపీలు నిర్మించి మూసీలో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కొండపోచమ్మసాగర్ నుంచి గోదావరి జలాలు తెచ్చి నింపే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. కానీ రేవంత్ ఇదేదో తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. ఢిల్లీకి డబ్బు మూటలు పంపేందుకే మూసీని తెరపైకి తెచ్చారని, ఈ ప్రాజెక్టు పేరిట రియల్ ఎస్టేట్ దందా చేస్తామంటే ఊరుకోబోమని, అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ

# పీఏసీ చైర్మన్‌గా హరీశ్‌నే నియమించాలి

- ప్రతిపక్ష నేత ప్రతిపాదనను గౌరవించండి
- అరికెపూడి గాంధీని పదవి నుంచి తొలగించండి
- మాజీ మంత్రులు వేముల, సత్యవతి , ఎమ్మెల్సీ రమణ

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : పీఏసీ చైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ సూచించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాలను రేవంత్‌రెడ్డి సర్కార్ తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు. శాసనసభలో ప్రతిపక్షనేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిపాదించిన హరీశ్‌రావును పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని ఇంకా ఎంతకాలం వాళ్లు పార్టీ మారలేదని బుకాయిస్తారని నిప్పులు చెరిగారు. సోమవారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 2014లో రాష్ట్రంలో ప్రతిపక్ష నేత జానారెడ్డి సూచించిన గీతారెడ్డి, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డిను కేసీఆర్ ప్రభుత్వం పీఏసీ చైర్మన్లుగా నియమించిందని, ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నాటి విపక్షనేత చంద్రబాబు సూచించిన యనమల రామకృష్ణుడు, నాగం జనార్దన్‌రెడ్డిని చైర్మన్లుగా నియమించిందని వేముల గుర్తుచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రతిపక్షనేత కేసీఆర్ సూచించిన హరీశ్‌రావును కాదని అరికెపూడి గాంధీని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యుడిని బీఆర్ఎస్ సభ్యుడే అంటూ బుకాయిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తీరుపై వేముల ఆగ్రహం వ్యక్తం చేశారు. అరికెపూడితో పాటు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో నిర్వహించిన సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హాజరైన విషయాన్ని, ఏఐసీసీ అధిష్ఠానానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో ప్రస్తావించారు.

### ద్వంద్వ వైఖరి వీడాలి: సత్యవతి

కాంగ్రెస్ వచ్చాక అన్ని వర్గాలను, అన్ని ప్రజాస్వామిక సంప్రదాయాలను బుల్డోజ్ చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతీ రాథోడ్ విమర్శించారు. ఇకనైనా ద్వంద్వ వైఖరి వీడి సీఎం రేవంత్‌రెడ్డికి దమ్మూ, ధైర్యం ఉంటే బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి కాంగ్రెస్ గుర్తుతో గెలిపించి పదవులు ఇప్పించుకోవాలని సవాల్ చేశారు.

### పీఏసీ సమావేశం నుంచి వాకౌట్

అసెంబ్లీలోని కమిటీహాల్‌లో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా పీఏసీ చైర్మన్‌ను ప్రభుత్వం నియమించిందని నిరసన తెలిపింది. రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రతిపాదించిన హరీశ్‌రావును కాదని, అరికెపూడిని నియమించటాన్ని ఆక్షేపిస్తూ మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ పీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

# రాజ్ పాకాలకు హైకోర్టులో ఊరట

- పోలీసుల ముందు హాజరయ్యేందుకు 2 రోజుల గడువు
- నోటీసు ఇచ్చిన గంటన్నరలో హాజరు కావాలంటే ఎలా?
- పోలీసులను నిలదీసిన న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్
- రెండురోజుల దాకా కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం
- తదుపరి విచారణ నవంబర్ 25కు వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): జన్వాడలో జరిగిన విందు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ (రాజ్ పాకాల)కు సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు విచారణకు హాజరయ్యేందుకు గడువు కావాలన్న పిటిషనర్ అభ్యర్థనకు కోర్టు సమ్మతించింది. రెండు రోజుల గడువు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన హోంశాఖ ముఖ్యకార్యదర్శి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మోకిల స్టేషన్‌హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)/సబ్‌ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. తదుపరి విచారణను నవంబర్ 25కు వాయిదా వేశారు.



ఏదైనా పార్టీలో డ్రగ్స్ వినియోగించిన వాళ్లు పట్టుబడితే వాళ్లకు చట్ట ప్రకారం పడే శిక్ష ఆరు మాసాలేనని, ఇలాంటి కేసుల్లో నోటీసులు జారీ చేయవచ్చు కదా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.

### నోటీసులపై స్పందించే వరకు చర్యలు వద్దు

సోమవారం ఉదయం 9.30కు నోటీసు అందజేసి అదే రోజు ఉదయం 11గంటలకు విచారణకు హాజరుకావాలంటే ఎలాగని హైకోర్టు పోలీసులను నిలదీసింది. ఈ చర్య నిష్పాక్షిక దర్యాప్తుపై సందేహాలు ఉన్నాయన్న పిటిషనర్ అభియోగాలకు బలం చేకూర్చడం లేదా అని ప్రశ్నించింది. అందుకే నోటీసుపై పిటిషనర్ స్పందించేదాకా ఆయనపై మోకిలా సీఐ, ఎస్సైలు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని ఆదేశిస్తున్నామని వెల్లడించింది. ఉదయం కోర్టు ప్రారంభం కాగానే తమ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు చేపట్టాలని రాజ్‌పాకాల తరపు సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి కోరారు. భోజన విరామం తర్వాత విచారణకు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అంగీకరించారు. పోలీసులు హడావుడిగా దర్యాప్తు చేసి కేసులో ఇరికించే కుట్ర జరుగుతుందంటూ మయూర్‌రెడ్డి ఆందోళనను పరిగణనలోకి తీసుకున్నారు.

### రాజకీయ కక్షతోనే కేసు..

తొలుత పిటిషనర్ తరపున మయూర్‌రెడ్డితోపాటు న్యాయవాది విమల్‌వర్మ వాసిరెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ కక్షతో పిటిషనర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. కొత్త ఇంట్లోకి వెళ్లిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపావళి పండుగకు ముందు ఇంట్లో బంధువులతో దావత్ చేసుకుంటే ఏదో జరిగిపోయినట్టు పోలీసులు భారీ సంఖ్యలో వచ్చి నానా హంగామా సృష్టించారని తెలిపారు. రాజ్ పాకాల ఉద్యోగి విజయ్‌కి వైద్య పరీక్ష నిర్వహిస్తే డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ అయ్యిందని చెప్పి పిటిషనర్‌ను కేసులో ఇరికించారని ఆరోపించారు. విచారణకు హాజరుకాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు ముందుగానే హెచ్చరించడాన్ని బట్టి వాళ్లు పిటిషనర్‌ను ఏం చేయబోయేదీ అర్థం అవుతున్నదని అన్నారు.

### కేటీఆర్ కుటుంబమే లక్ష్యంగా..

*కేటీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని పోలీసులు ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించారని పిటిషనర్ తరపు న్యాయవాదులు తెలిపారు. పోలీసులు అత్యుత్సాహంతో ఆ ఇంట్లోనే ఉన్న మహిళలు, బంధువులు, స్నేహితులకు బలవంతంగా యూరిన్ టెస్ట్ చేయించారని, డ్రగ్స్ వినియోగించినట్టు ఏ విధమైన ఆధారాలు లభ్యం కాకపోవడంతో పిటిషనర్‌ని కేసులో ఇరికించాలనే కుట్రకు తెరతీశారని తెలిపారు. ఎలాగైనా కేటీఆర్ బావమరిదిని అరెస్టు చేయాలనే కుట్ర పూరితంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్ల మేరకే పనిచేస్తున్నారని అన్నారు.*

### వ్యక్తిగత జీవితంలోకి చొరబడకుండా చేయాలి..

రాజకీయ విభేదాలతో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలపై తప్పుడు కేసు నమోదు చేశారని న్యాయవాదులు చెప్పారు. ఓ మంత్రి కేటీఆర్‌పై ఇటీవల తీవ్ర పదజాలంతో మాట్లాడితే, ఆయన పరువు నష్టం దావా వేశారని గుర్తుచేశారు. మరో మంత్రి దీపావళి పండుగలోగా బీఆర్ఎస్ నేతలపై రాజకీయ బాంబ్ పేలుతుందని చెప్పారని, ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేటీఆర్ కుటుంబసభ్యులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు కేసుల్ని బనాయించేందుకు తెర తీశారని అన్నారు. నూతన గృహ ప్రవేశ వేడుకలకు బంధువులు, స్నేహితులంతా ఉండగా పోలీసులు చట్ట వ్యతిరేకంగా ఫాంహౌస్‌లోకి చొరబడ్డారని చెప్పారు.

### విదేశీ మద్యం లభించింది: ప్రభుత్వం

ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ ప్రతివాదనలు చేస్తూ, పిటిషనర్‌కు పోలీసులు 41ఏ నోటీసులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని తెలిపారు. ఆ ఇంట్లో అక్రమంగా దాచిన విదేశీ మద్యం సీసాలు లభ్యం అయ్యాయని చెప్పారు. మద్దూరి విజయ్ కొకైన్ తీసుకున్నట్టు పరీక్షల్లో తేలిందని అన్నారు. రాజ్‌పాకాలతో విజయ్‌కి ఐదేండ్లుగా సంబంధాలు ఉన్నాయని చెప్పారు. కేసు వెనుక రాజకీయ ఉద్దేశమే లేదని అన్నారు. ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలు, సమాచారం ఆధారంగానే కేసు దర్యాప్తు జరుగుతుందని చెప్పారు.



## ఇందిరమ్మ రాజ్యమంటే ఆంక్షలా?

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ రాజ్యం అంటే ఆంక్షలు విధించటమా? కర్ఫ్యూ వాతావరణం సృష్టించడమా? అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో దేశానికే మకుటాయమానంగా తీర్చిదిద్దిన పోలీస్ వ్యవస్థను కేవలం 10 నెలల్లోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని పేర్కొన్నారు. దేశ చరిత్రలో పోలీసులు నిరసనకు దిగడం ఇదే తొలిసారి అని, ఇది కాంగ్రెస్ సర్కారు మార్క్‌ను గుర్తుచేసిందని విమర్శించారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గుర్తుచేసినందుకు పోలీసులను సస్పెండ్, డిస్మిస్ చేయడం దారుణమని పేర్కొన్నారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌పై పోలీసులను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. రేవంత్ కుట్రలో పోలీసులు పావులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



## తెలంగాణలో ఎమర్జెన్సీ రోజులు

జగిత్యాల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల పాలన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నది.. ఎప్పుడు ఏమవుతుందోనని తెలియక ప్రజలు భయపడే పరిస్థితి నెలకొన్నది..' అని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జగిత్యాలలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంతతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ బావమరిది కుటుంబసభ్యులతో కలిసి దావత్ చేసుకుంటే అక్రమ అరెస్టులు చేయించడం సిగ్గుమాలిన చర్యగా పేర్కొన్నారు.



## బండి సంజయ్‌కి డ్రగ్స్ పరీక్షలు చేయాలి

జగిత్యాల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోం మంత్రి బండి సంజయ్, ఆయన కొడుక్కి డ్రగ్స్ పరీక్షలు చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. జగిత్యాలలో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ బావమరిది గృహప్రవేశ కార్యక్రమ విందు ఏర్పాటుచేసుకుంటే దానిని రేవ్‌పార్టీగా చిత్రీకరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. కుటుంబ విందుకు, రేవ్ పార్టీకి తేడా తెలియని సీఎం ఉండడం బాధాకరమని పేర్కొన్నారు. రేవ్‌పార్టీ అంటూ సీఎం తప్పుడు ఆరోపణలు చేసి కేసులు పెడితే.. కేంద్ర మంత్రి బండి డ్రగ్స్ అంటూ కూతలు కూస్తున్నాడని మండిపడ్డారు.



## రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్

తిమ్మాపూర్, అక్టోబర్ 28 : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చలేక.. హైడ్రాపై వస్తున్న వ్యతిరేకతను మరల్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చావైనా, బతుకైనా పండుగలా చేసుకోవడం తెలంగాణ సంస్కృతి అని పేర్కొన్నారు. కేటీఆర్ బావమరిది గృహప్రవేశ దావత్‌ను రేవ్‌పార్టీగా చిత్రీకరించి కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

## ఉద్యమ కార్యాచరణపై టీజీఎస్ఆర్టీసీ ప్రచారం

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తేతెలంగాణ) : టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించడం, డిసెంబర్ 5న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని జేఏసీ ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో ప్రచారం నిర్వహించారు. సోమవారం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైఎస్ చైర్మన్ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు కన్వీనర్ మౌలానా, కో-కన్వీనర్లు యాదయ్య, సురేశ్, యాదగిరి రాణిగంజ్, కంటోన్మెంట్, పికెట్ డిపోలు, జేంజ్ ఓవర్ పాయింట్, సంగీత్ జోనల్ అకౌంట్ ఆఫీస్‌లో పర్యటించి ఉద్యమ కార్యాచరణను వివరించి, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, 2021 వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు.


Regional Directorate of Skill Development & Entrepreneurship
Ministry of Skill Development & Entrepreneurship
Directorate General of Training
NSTI Vidyanagar, Hyderabad.
सत्यमेव जयते
Directorate General of Training

GUEST FACULTY NOTIFICATION

| | |
|---|---|
| Organization | National Skill Training Institute, Vidyanagar Hyderabad - 500 007 |
| Vacancy Name | Guest Faculty (Local language (Telugu) preferable) |
| No. of vacancies | 06 posts. |
| Trade/Subject wise number of posts vacant | 1. Electrician (CITs) - 01 no<br>2. Machinist (CTS) - 01 no<br>3. Training Methodology (CITS) - 03 nos<br>4. Information Technology (CITS) - 01 no |
| Desired Qualification | Engineering Degree with CTS along with 1 year experience in relevant trade. Diploma with CITS along with 2 years experience with relevant trade. ITI with CITS certificate with 3 years experience with relevant trade. |
| Mode of Selection | Written Test and Practical Test |
| Date of selection | 13.11.2024 at 9.30 am |
| Official website | https://nstihyderabad2.dgt.gov.in/ |
| How to apply | (or) https://forms.gle/pvASszBpLAfPiLac7 |
| Last Date to Apply | 08.11.2024 |

Note : Please Bring all your original certificates, Aadhaar Card for verification and xerox copies of all the certificates and passport sized photographs.

REGIONAL DIRECTOR
RDSDE Telangana, Hyderabad